సాక్షి
మహబూబ్‌నగర్
శనివారం । 28 । జనవరి । 2023



ఉత్సవాలకు ముస్తాబు
పేదల తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండ బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది.
వివరాలు 8లో ▸



విద్యుత్ కోతలపై ఆగ్రహం
విద్యుత్ కోతలను నిరసిస్తూ గట్టులోని సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ధర్నా చేపట్టారు.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం 32.2 /16.4

వాతావరణం
ఉదయం, రాత్రి వేళలో చలి తీవ్రత అధికంగా ఉంటుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉత్సాహంతో పని చేయాలి: ఎస్పీ



మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్‌శాఖలో క్షేత్ర స్థాయి పోలీస్ సిబ్బందితో పాటు పరిపాలన సిబ్బంది సేవలు అత్యుత్తమంగా ఉంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని, కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతస్థాయి అధికారులు వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయడం వల్ల శాఖ ఖ్యాతి పెరుగుతుందని ఎస్పీ కె.నర్సింహ అన్నారు. జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న క్రమంలో శుక్రవారం జిల్లా పోలీస్ సిబ్బందితో పాటు పరిపాలన సిబ్బందితో ఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పోలీస్ అధికారులతో పాటు సిబ్బందిని ఎక్కడ పని చేస్తారు, వారి విధులను తెలుసుకున్నారు. భవిష్యత్‌లో ఉత్సాహంతో పని చేయాలని సూచించారు. అనంతరం నూతన ఎస్పీని జిల్లా పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, ఏఓ రుక్మిణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో నేడు రథసప్తమి వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రం వెంకటేశ్వరకాలనీలోగల గెలాక్సీ పాఠశాలలో రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు రథసప్తమి వేడుకలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులచే సూర్యనమస్కారాలు, ఆదిత్య హృదయ పఠనం, అన్నమాచార్య సంకీర్తనలు, రథసప్తమి విశిష్టత ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు.

కందుల ధర రూ.6,870

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన ఈనామ్ టెండర్లలో కందుల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,870 ఒకే ధర నమోదైంది. పంటల దిగుబడి సీజన్ లేకపోవడం వల్ల మార్కెట్‌లో లావాదేవీలు తక్కువగా జరిగాయి.

కుండలినియోగాకు సాంకేతికత జోడి



జడ్చర్ల: కుండలినియోగాకు సాంకేతికను జోడించడం వలన పలు ప్రయోజనాలు ఉన్నాయని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సీఆర్ రావు తెలిపారు. మండలంలోని గొల్లపల్లి లలితాంబిక తపోవనంలో నిర్వహిస్తున్న కుండలిని సింపోజియమ్ అంతర్జాతీయ సదస్సులో శుక్రవారం రెండవ రోజు ఆయన మాట్లాడారు. వ్యక్తులతో పాటు వారి కుటుంబ, సమాజ ప్రయోజనం కోసం కుండలిని యోగాతో సాంకేతికత, సైన్స్, ఆధ్యాత్మికతను జోడించడం కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా వివిధ దేశాల నుంచి పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో సర్వేశ్వరానందగిరి స్వామి, చంద్రగిరి స్వామి, రవి స్వామి, పద్మజ పాల్గొన్నారు.

13,190 మందికి అంధత్వ లక్షణాలు

పాలమూరు: జిల్లాలో కంటి వెలుగు పరీక్షలు కొనసాగుతున్నాయి. 45 వైద్య బృందాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని మున్సిపాలిటీలతో పాటు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో శుక్రవారం 8,616 మందికి కంటి పరీక్షలు చేయగా 1,534 మందికి అంధత్వ లక్షణాలు ఉన్నట్లు గురించి అందులో 931మందికి అక్కడే రీడింగ్ అద్దాలు పంపిణీ చేయగా మరో 603 మందికి దూరచూపు అద్దాల కోసం ఆర్డర్ పెట్టారు. ఇప్పటి వరకు జిల్లాలో 48,403 మందికి కంటి పరీక్షలు చేయగా 13,190 మందికి అంధత్వ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 8,093 మందికి రీడింగ్ అద్దాలు ఇవ్వగా 5,097 మందికి ఆర్డర్ పెట్టారు.

అక్షరాస్యత సగమే..

- స్కూల్ గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ 80 శాతంలోపే..
- డ్రాపౌట్స్‌లో గద్వాల జిల్లా రాష్ట్రంలోనే మూడోస్థానం
- తలసరి ఆదాయంలో వెనకబడిన ఉమ్మడి జిల్లాలు
- నారాయణపేటలో అధికంగా పిల్లల్లో పోషకాహార లోపం
- రాష్ట్ర గణాంకాల నివేదికలో వెల్లడి


విద్యాభివృద్ధిలో అట్టడుగున పాలమూరు జిల్లాలు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలు ఇంకా అక్షరాస్యతలో వెనుకబడే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో అక్షరాస్యతతో పోల్చితే జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో అక్షరాస్యత శాతం సగానికి మించడం లేదు. పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థులు సైతం చాలావరకు కనీసం పదో తరగతికి కూడా చేరుకోవడం లేదు. స్కూల్ డ్రాపౌట్స్ విషయంలోనూ జోగుళాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలో మూడోస్థానంలో ఉంది. వ్యక్తుల ఆదాయంగా పరిగణించే తలసరి ఆదాయంలోనూ ఉమ్మడి పాలమూరు జిల్లాలు వెనుకంజలోనే ఉంటున్నాయి. ఇటీవల విడుదలైన తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్–2022 రిపోర్టులో ఈ విషయాలన్నీ వెల్లడయ్యాయి.


హైస్కూల్ వరకు చేరకుండానే బడికి దూరం..
గద్వాల, నారాయణపేట జిల్లాల్లో విద్యార్థులు చాలావరకు కనీసం పదో తరగతి వరకు చేరకుండానే బడి మానేస్తున్నారు. హైస్కూల్ విద్యార్థుల డ్రాపౌట్స్ విషయంలో గద్వాల జిల్లా 23.37 శాతంతో రాష్ట్రంలో మూడో స్థానంలో కొనసాగుతోంది. నారాయణపేట జిల్లాలోనూ 19.59శాతం మంది పదో తరగతి చదవకుండానే బడి మానేస్తున్నారు. తర్వాత నాగర్‌కర్నూల్ జిల్లాలో 15శాతం మంది డ్రాపౌట్లు ఉంటున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు విషయంలోనూ పాలమూరు జిల్లాలు వెనుకబడి ఉన్నాయి. ప్రధానంగా నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ 80 శాతానికే పరిమితం అవుతోంది.



జిల్లాల వారీగా అక్షరాస్యత రేటు (శాతాల్లో) వివరాలు



పాఠశాలల్లో నమోదు శాతం, డ్రాపౌట్ల వివరాలు(శాతాల్లో)..



అక్షరాస్యత 50శాతం లోపే..

ప్రజల్లో అక్షరాస్యత శాతం విషయంలో గద్వాల, నారాయణపేట జిల్లాల్లో కనీసం 50శాతం కూడా దాటడం లేదు. సాధారణంగా సంతకం చేయగలిగిన వారందరినీ అక్షరాస్యులుగానే భావిస్తారు.అయితే ఈ జిల్లాలో అక్షరాస్యులు సగం మంది కూడా లేరు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 54.4 శాతం, వనపర్తిలో 55.7 శాతం, మహబూబ్‌నగర్‌లో 61.1 శాతం మంది అక్షరాస్యులు ఉన్నారు. మహిళల్లో అక్షరాస్యత విషయంలో పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. గద్వాల జిల్లాలో మహిళల అక్షరాస్యత శాతం 39.5 శాతం, నారాయణపేటలో 39.7 శాతానికే పరిమితం కాగా, నాగర్‌కర్నూల్‌లో 43.6 శాతం , వనపర్తిలో 49.3 శాతం, మహబూబ్‌నగర్‌లో 51.4 శాతం అక్షరాస్యత నమోదైంది.

తలసరి ఆదాయం అంతంతే..


తలసరి ఆదాయం విషయంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలు అట్టడుగునే కొనసాగుతున్నాయి. నారాయణపేట జిల్లాలో రూ.1.41 లక్షలతో అతి తక్కువ తలసరి ఆదాయం నమోదైంది. ఈ విషయంలో రాష్ట్రంలోనే అట్టడుగు స్థాయి నుంచి నాలుగో స్థానంలో నారాయణపేట కొనసాగుతుండగా, రూ.1.46 లక్షల తలసరి ఆదాయంతో గద్వాల జిల్లా చివరి నుంచి ఆరో స్థానంలో ఉంది. అలాగే నారాయణపేట జిల్లాలో అత్యధికంగా 5.28శాతం మంది చిన్నారులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. నాగర్‌కర్నూల్‌లో 4.55శాతం, మహబూబ్‌నగర్‌లో 4.41శాతం, వనపర్తిలో 3.50శాతం, గద్వాలలో 2.25 శాతం మంది చిన్నారులు పోషకాహారలోపాన్ని ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధికంగా 9,05,660 మంది జనాభా ఉండగా, అత్యల్పంగా నారాయణపేట జిల్లాలో 5,62,148 మంది ఉన్నారు. జనసాంద్రత విషయంలో మహబూబ్‌నగర్‌లో అత్యధికంగా ఒక చ.కి.మీ.కు 329 మంది ఉంటే అత్యల్పంగా నాగర్‌కర్నూల్‌లో 135 మంది ఉన్నారు.

■ స్త్రీ, పురుష నిష్పత్తి విషయంలో నారాయణపేట జిల్లా ఆదర్శంగా ఉంది. ప్రతి వెయ్యి మంది పురుషులకు రాష్ట్ర సగటు 988 మంది స్త్రీలు మాత్రమే ఉండగా, నారాయణపేట జిల్లాలో ప్రతి వెయ్యి మంది పురుషులకు 1,008 మంది స్త్రీలు ఉన్నారు. వనపర్తిలో మాత్రం రాష్ట్ర సగటు కంటే తక్కువగా 960 మంది మాత్రమే ఉన్నారు.


జిల్లాల వారీగా జనసాంద్రత (చ.కి.మీ.కు ఉన్న జనాభా సగటు)

జిల్లా	జనాభా	జన సాంద్రత
మహబూబ్‌నగర్	9,05,660	329
నాగర్‌కర్నూల్	8,61,766	135
వనపర్తి	5,77,758	266
జోగుళాంబగద్వాల	6,09,990	236
నారాయణపేట	5,62,148	236

స్త్రీ, పురుష నిష్పత్తి (ప్రతి వెయ్యి మంది పురుషులకు ఉన్న స్త్రీల సంఖ్య)



తలసరి ఆదాయం (ప్రస్తుత ధరల ప్రకారం)





పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారుల శాతం

స్వాప్ ప్రక్రియ ప్రారంభం

- నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలో సీనియారిటీ జాబితా ప్రకటన
- మిగతా జిల్లాల్లో అర్ధరాత్రి వరకు కొనసాగిన కసరత్తు
- నేటి నుంచి 30 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మరూ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. శుక్రవారం సాయంత్రం నాటికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 13వేలకు పైగా ఉన్న ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా వివరాలను అధికారులు ఆన్‌లైన్‌లో ఉంచాల్సి ఉంది. శుక్రవారం రాత్రి వరకు కూడా ఎక్కడా అధికారులు ప్రదర్శించలేదు. సాయంత్రం వరకు ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లాలోనే జాబితాను విడుదల చేశారు. అర్ధరాత్రి నారాయణపేట జిల్లాకు సంబంధించిన సీనియార్టీ జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచారు. మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తికి సంబంధించిన జాబితా కూడా తుది దశకు చేరినట్లు తెలుస్తోంది. జాబితా సిద్ధమైన వెంటనే డీఈఓ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని జిల్లాశాఖ అధికారులు తెలిపారు. కాగా, శుక్రవారం రాత్రి వరకు మహబూబ్‌నగర్ డైట్ కళాశాల మైదానంలో ఉపాధ్యాయులు పడిగాపులు కాశారు.

61 మంది స్వాప్‌కు అనుమతి
ప్రభుత్వ ఉద్యోగులైన భార్యాభర్తలు ఒకే జిల్లాలో ఉద్యోగం చేసే విధంగా బదిలీల కోసం గతంలోనే ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. అయితే రాష్ట్రంలో అన్ని జిల్లాలకు అనుమతి ఇచ్చిన కేవలం 13 జిల్లాలకు ఇవ్వలేదు. ఇందులో మహబూబ్‌నగర్ కూడా ఉంది. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అనుమతి ఇవ్వడంతో మహబూబ్‌నగర్ జిల్లాకు 61 స్వాప్‌లకు బదిలీల కోసం వివిధ జిల్లాలో పనిచేస్తున్న వారిని రిలీవ్ చేసి జిల్లాకు పంపించనున్నట్లు తెలుస్తుంది. ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు వెళ్లే వారికి సైతం అవకాశం ఉంది. అయితే శుక్రవారం సాయంత్రం నాటికి వీరికి కలెక్టర్ అనుమతితో ఆర్డర్లు ఇచ్చేందుకు విద్యాశాఖ అధికారులు ప్రయత్నాలు చేశారు. కానీ అది సాధ్యపడలేదు. అయితే ఈ స్వాప్‌లో వేరే జిల్లాల నుంచి వచ్చే వారు, ఇక్కడి నుంచి వేళ్లే వారు కూడా ఉండడంతో సీనియార్టీ జాబితాలో మార్పులు చేర్పులు అయ్యే అవకాశం నెలకొనడంతో గందరగోళం నెలకొంది. వనపర్తి, నారాయణపేట, గద్వాలలో కూడా ఇదే పరిస్థితి. 33 మంది స్వాప్ ఉద్యోగులు నాగర్‌కర్నూల్ నుంచి రిలీవ్ అయ్యారు.





శుక్రవారం రాత్రి ఉపాధ్యాయ సంఘాలతో మాట్లాడుతున్న డీఈఓ లియాకత్ అలీ

61 మంది ఉపాధ్యాయులకు అవకాశం



స్వాప్ కింద 61 మంది ఉపాధ్యాయులు ఇతర జిల్లాల నుంచి మహబూబ్‌నగర్‌కు వచ్చేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. వారికి శుక్రవారం సాయంత్రం నాటికి ఆర్డర్లు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వలేదు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే, సీనియారిటీ జాబితా, ఖాళీల వివరాలన్నపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.
– యాదయ్య, డీఈఓ, మహబూబ్‌నగర్

33 మంది రిలీవ్..



జిల్లావ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయుల వివరాలు, ఖాళీల జాబితాలను శుక్రవారం సాయంత్రం నాటికి అందుబాటులో ఉంచాం. ఇందులో స్వాప్ కింద 33 మందిని రిలీవ్ చేశా. 1,308 ఖాళీల వివరాలను సైతం ప్రదర్శించాం . శనివారం నుంచి ఆన్‌లైన్‌లో బదిలీలకు సంబంధించిన దరఖాస్తు చేసుకోవచ్చు.
– గోవిందరాజులు, డీఈఓ, నాగర్‌కర్నూల్

■ నిబంధనల ప్రకారం సర్వీస్, అర్హత తదితర అంశాల్లో సీనియార్టీ ఉన్నవారు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. శనివారం నుంచి ఈనెల 30 వరకు బదిలీలకు సంబంధించిన దరఖాస్తులను అధికారులు స్వీకరించనున్నారు. వాటిని మూడు రోజుల పాటు పరిశీలించి, అర్హులైన వారిని ప్రకటించేందుకు అవకాశం ఉంది.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



హాత్ సే హాత్ జోడో యాత్ర స్టిక్కర్‌ను చూయిస్తున్న రేవంత్‌రెడ్డి

- హాత్ సే హాత్ జోడో యాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- మద్దూరు, కొత్తపల్లి, కోస్గిలో సాగిన రోడ్ షో

కోస్గి/మద్దూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా కష్టపడి పనిచేయాలని, అలాంటి వారికే తన దగ్గర గుర్తింపు ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు, మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా నియోజకవర్గంలో చేపట్టిన సన్నాహక యాత్ర శుక్రవారం మద్దూరు, కొత్తపల్లి, కోస్గి మండలాల్లో కొనసాగింది. రాత్రి కోస్గి పట్టణంలోని శివాజీ చౌరస్తాలో రోడ్ షోలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ ఒక్కో నాయకుడు వెయ్యి ఓట్లు వేయించేలా కష్టపడి పనిచేయాలన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అభివృద్ధి జరిగిందన్నారు. రైతులకు కోసం 2 వేల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 30 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, ఒక 220 కేవీ సబ్‌స్టేషన్, 4 132 కేవీ సబ్‌స్టేషన్లు మంజూరు చేయించానన్నారు. అప్పట్లోనే రూ.250 కోట్లతో కోయిల్‌సాగర్ నుంచి కొడంగల్ నియోజకవర్గంలోని 5 మండలాలకు, దామరగిద్ద, కోయిలకొండ మండలాల్లోని ఇంటింటికి నల్లా చేపట్టితే దాన్ని పేరు మార్చి మిషన్ భగీరథ ద్వారా ఇచ్చారని గుర్తుచేశారు. కోస్గి బస్ డిపోకు 5ఎకరాల స్థలం, పల్లెర్ల సబ్‌స్టేషన్ కోసం స్థలం, మద్దూరులో గురుకుల పాఠశాలకు 5 ఎకరాల స్థలం నా సొంత డబ్బులతో కొని ఇచ్చిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కొడంగల్– నారాయణపేట ఎత్తిపోతల ద్వారా 1.07 లక్షల ఎకరాలకు సాగునీరు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో విడుదల చేయించి, ఈ ప్రాజెక్టు కోసం రూ.1,560 కోట్లు మంజూరు చేయిస్తే ఈ ప్రభుత్వం వచ్చి తొక్కి పెట్టిందన్నారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా రెండేళ్లలో కొడంగల్ ప్రజల కాళ్లు కడుగుతామన్న వారు ఇన్నేళ్లు గడిచినా అతీగతీ లేదన్నారు.

కుటిల రాజకీయాలతోనే..
8 మండలాలున్న వనపర్తి జిల్లా అయితే అదే 8 మండలాలున్న కొడంగల్ రెవెన్యూ డివిజన్ ఎందుకు కాలేదని నిలదీశారు. వీరి కుటిల రాజకీయాలతో కొడంగల్‌ను ముక్కలు చేశారని విమర్శించారు. ఇక్కడి ప్రజలు అధికార పనుల కోసం తాండూరు, వికారాబాద్, నారాయణపేటకు తిరగాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. రాహుల్‌గాంధీ సందేశంతో కూడిన కరపత్రం, హాత్‌సే హాత్ జోడో యాత్ర స్టిక్కర్‌ను కార్యకర్తలు ప్రతి ఇంటి దగ్గర వెళ్లి అంటించాలన్నారు. వచ్చే నెల 6న ప్రారంభమయ్యే జోడో యాత్రలో ప్రతి ఒక్కరు పాల్గొని రాహుల్‌గాంధీ సందేశాన్ని గడపగడపు చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీధర్, కొడంగల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రఘుపతిరెడ్డి, టీపీసీసీ మెంబర్ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రూ.80కోట్లతో మన్యంకొండ అభివృద్ధి



జాతర పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ వెంకట్రావ్, తదితరులు

- బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి
- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మన్యంకొండ జాతరను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, దేవాలయ పాలకమండలి, ప్రజా ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. మన్యంకొండ దేవాలయాన్ని రూ.80కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, రూ.50కోట్లతో రోప్ వే, రూ.10కోట్లతో అన్నదాన సత్రాన్ని నిర్మించనున్నామని, టెండర్ ప్రక్రియ పురోగతిలో ఉన్నట్లు వివరించారు. అంతేకాక మరో రూ.15 కోట్లతో టూరిజం హోటల్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. అలివేలు మంగ దేవాలయం దగ్గరలో 63 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహాన్ని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఒకేసారి 100 పెళ్లిళ్లు చేసేలా పెద్ద షెడ్లను నిర్మిస్తున్నామన్నారు. మహబూబ్‌నగర్ – రాయచూరు ప్రధాన రహదారి నుంచి మన్యంకొండకు వెళ్లే 35 ఫీట్ల రహదారిని 80 ఫీట్లకు పెంచామని, కొండ కింద చెరువును అభివృద్ధి చేసి అక్కడే భక్తులు స్నానం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దేవాలయానికి సంబంధించి సుమారు 195 ఎకరాలు, లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయానికి సంబంధించిన 23 ఎకరాలు ఉందని, ఈ భూములలో మొక్కలు నాటాలని తెలిపారు. జాతర సందర్భంగా భక్తులను అలరించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కలెక్టర్ వెంకట్రావ్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం జాతర పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్పీ నర్సింహ, అదనపు కలెక్టర్ సీతారామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఏఎస్పీ రాములు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు, ఎంపీపీ సుధాశ్రీ, వైస్ ఎంపీపీ అనిత పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి నిధులివ్వండి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కార్మికుల సంక్షేమానికి వెంటనే నిధులు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కార్మికశాఖ మంత్రి గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. బీమా కార్డులు ఉన్న కార్మికులందరికీ బైకులు ఇవ్వాలని, ఈ హామీ ఇచ్చి 9నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల కాన్పు కానుక, పెళ్లి కానుక, సాధారణ మరణం తదితర క్లైయిమ్‌లు జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటికి వెంటనే నిధులు విడుదల చేయాలని, గతంలో ఇచ్చే పెళ్లి, కాన్పు కానుకలకు రూ.30వేల నుంచి రూ.లక్ష పెంచాలని కోరారు. సాధారణ మరణానికి రూ.5 లక్షల, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షల ఇవ్వాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఓ శంకర్‌కు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాములు, గాలన్న, తిరుమలయ్య, రాజు, వెంకటయ్య, లక్ష్మయ్య, కృష్ణయ్య, కేశవులు, సత్యం , శేఖర్, నాగన్న, కృష్ణయ్య పాల్గొన్నారు.



హరితహారం మొక్కలను సంరక్షించాలి



మొక్కలకు నీరు పోస్తున్న అడిషనల్ కలెక్టర్ తేజాస్ నందులాల్ పవార్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాలని, అవి ఎండిపోకుండా ప్రతి శుక్రవారం నీరు పోయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ అన్నారు. శుక్రవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావుతో కలిసి కలెక్టరేట్‌లో మొక్కలకు నీరు పోశారు. మొక్కలు, గార్డెనింగ్ సంరక్షణ, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటడం, క్రమం తప్పకుండా నీరు అందించేలా ఉద్యాన శాఖ ఏడీ సాయిబాబా, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని రహదారులకు ఇరువైపులా, సంస్థలలో నాటిన మొక్కలు నీరు పెట్టాలని ఆదేశించారు.

క్లుప్తంగా

హైవేపై యువకుడి దుర్మరణం

అడ్డాకుల: రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మూసాపేట మండలం సంకలమద్ది శివారులోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండలం యత్మతాపూర్ చెందిన అంబటి రాజు(28) మూసాపేట మండలం సంకలమద్ది అనుబంధ గ్రామమైన బంగ్లగడ్డకు చెందిన ఓ యువతిని కొన్నేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. అత్తగారింటికి వచ్చిన యువకుడు శుక్రవారం తెల్లవారుజామున ఈద్గా వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. రాజు తల పగిలి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

గుర్తు తెలియని యువకుడు..

మహబూబ్‌నగర్ క్రైం: మండలంలోని వెంకటాపూర్ పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గుర్తు తెలియని యువకుడు(25) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి దగ్గర ఎలాంటి వివరాలు లభించలేదు. ఘటన స్థలాన్ని రూరల్ పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు.

బాలికపై అత్యాచారయత్నం

నర్వ: మండలంలోని బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రమ్ అందించిన వివరాల మేరకు ధన్వాడ మండలం ఎమ్మినోస్‌పల్లికి చెందిన అబ్దుల్‌నబి ఆర్‌ఎంపీగా గ్రామంలో రెండేళ్లుగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఓ బాలికకు మాయమాటలు చెప్పి తరచుగా మాట్లాడడం, చాటింగ్ చేయడం వంటివి చేసి అత్యాచారయత్నానికి ప్రయత్నించాడన్నారు. ఈ సంఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైస్ మిల్లులో అగ్ని ప్రమాదం


కోస్గి: మండలంలోని కడంపల్లి శివారులో ఉన్న రైస్ మిల్లులో ప్రమాదశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మిల్లులో శుక్రవారం కరెంట్ షాక్‌తో నిప్పులు నిల్వ ఉన్న ధాన్యం సంచులతోపాటు ఖాళీగా ఉన్న గన్నీ బ్యాగులపై పడ్డాయి. కార్మికులు ఆలస్యంగా గుర్తించడంతో పెద్ద ఎత్తున ధాన్యం కాలిపోయింది. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పే సమయానికి రూ. 25 లక్షల విలువైన ధాన్యం, గన్నీ బ్యాగులు కాలిపోయాయి. యజమాని సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

సెజ్‌లో అగ్నిప్రమాదం: ముగ్గురికి తీవ్ర గాయాలు

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి సెజ్‌లో కొనసాగుతున్న ఓ పరిశ్రమలో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్లాస్టిక్ ట్యాంకులు ఇతర వస్తువుల తయారీ పరిశ్రమలో గ్యాస్ లీకేజీ కారణంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం ఏనుగొండ ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో కావేరమ్మపేటకు చెందిన మజార్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాదానికి సంబంధించి ఫిర్యాదు అందలేదని సీఐ రమేష్‌బాబు తెలిపారు.

ఉత్సవాలకు ముస్తాబు

- 31 నుంచి మన్యంకొండ బ్రహ్మోత్సవాలు
- ఫిబ్రవరి 5న స్వామి వారి రథోత్సవం
- ఈసారి భారీగా ఏర్పాట్లు



మన్యంకొండ దేవస్థానం

మహబూబ్‌నగర్ రూరల్: ఉమ్మడి జిల్లాలోనే లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం కలియుగ వైకుంఠంగా బాసిల్లుతుంది. తెలంగాణ తిరుపతిగా వినతికెక్కింది. ఇంతటి విశిష్టత గల మన్యంకొండ బ్రహ్మోత్సవాలు ఈనెల 31 నుంచి మార్చి 9వ తేదీ వరకు నిర్వహించున్నారు. ఉత్సవాల్లోని ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఫిబ్రవరి 5వ తేదీ రాత్రి చేపట్టనున్నారు. మహబూబ్‌నగర్ నుంచి 17 కిలోమీటర్ల దూరంలో రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారి పక్కన ఎత్తైన గుట్టలపై మన్యంకొండ దేవస్థానం కొలువుదీరింది. స్టేజీ నుంచి మూడు కిలోమీటర్ల మేర ఘాట్‌రోడ్డు గుండా వెళ్తే స్వామివారి దేవస్థానం ఉంటుంది. ఎంతో చరిత్ర గల దేవస్థానం దినదినాభివృద్ధి చెందుతూ భక్తుల పాలిట ఇలవేల్పు దైవంగా మారింది. తవ్వని కోనేరు, చెక్కని పాదాలు, ఉలి ముట్టని స్వామి ప్రత్యేకం. కేవలం ఉత్సవాల్లోనే దాదాపు లక్షకుపైగా భక్తులు దర్శించుకొని తరిస్తారు. ప్రతి ఏడాది స్వామివారికి భక్తుల నుంచి దాదాపు రూ.కోటికి పైగా ఆదాయం వస్తుంది.

హనుమద్దాసుల కీర్తనలతో ఖ్యాతి..

అళహరి వంశానికి చెందిన హనుమద్దాసుల వారి కీర్తనలతో మన్యంకొండ ఖ్యాతి గడించింది. దీంతో ఆగిపోయిన స్వామి పూజలు మళ్లీ ప్రారంభమయ్యాయి. హనుమద్దాసుల వారు మళ్లీ పూజలు ప్రారంభించి స్వామివారికి సంబంధించి దాదాపు 300 కీర్తనలు రచించారు. ఈ కీర్తనలు అప్పట్లో అందరినీ ఆకట్టుకున్నాయి. దేవస్థానం చరిత్రను చాటిచెప్పాయి. హనుమద్దాసుల కృషిని తెలుసుకున్న గద్వాల, వనపర్తి సంస్థానాధీశులు మన్యంకొండకు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అంతేకాకుండా స్వామివారి ఉత్సవాలకు తమవంతు ధర్మంగా అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో తమ సైనికులతో కలిసి ప్రతి ఏడాది మన్యంకొండకు వచ్చి స్వయంగా ఏర్పాట్లు చేసేవారు. ఏనుగులతో స్వామివారికి సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. స్వామివారు నిజంగా ఉన్నారని నిరూపించడానికి హనుమద్దాసుల వారు ఎన్నో పనులు చేసి చూపించారు. అప్పట్లో ఆయన దేవస్థానం వద్ద కోనేరును తవ్వించడంతోపాటు పెద్దగుడి గంటను కూడా ఏర్పాటు చేశారు. ఆ గంట ఇప్పటికీ చైర్మన్ గది పక్కన కనిపిస్తుంది. హనుమద్దాసుల తర్వాత ఆయన వంశానికి చెందిన అళహరి రామయ్య దేవస్థానం వద్ద ప్రారంభించారు. వంశపారంపర్య ధర్మకర్తగా ఉండడంతో పాటు దేవస్థానం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.



మన్యంకొండ శిఖరం



మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి

స్వామివారి సేవ చేసిన అళహరి వంశీయులు

స్వామివారి సేవలో అళహరి వంశీయులు చేసిన కృషి ఎంతో ఉంది. వారిలో అళహరి అనంతయ్య, కేశవయ్య, రంగయ్య, వెంకయ్య, పాపయ్య, హనుమద్దాసు, మేఘయ్య, అనంతయ్య, రామయ్య, వెంకటస్వామి, నారాయణస్వామి ఉన్నారు. ప్రస్తుతం అదే వంశానికి చెందిన అళహరి మధుసూదన్‌కుమార్ వంశపారంపర్య ధర్మకర్తగా కొనసాగుతున్నారు. దేవస్థానం స్థాపనకు కృషి చేసిన అళహరి వంశీయుల వంశవృక్షానికి తెలియజెప్పే చిత్రపటం దేవస్థానంలో ఏర్పాటు చేశారు. కొంతమంది ఫొటోలను కూడా ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



మన్యంకొండ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దేవస్థానం వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రశాంత వాతావరణంలో భక్తులు స్వామివారిని దర్శించుకుంటే బాగుంటుంది. లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి మహర్దశ రానుంది. దేవస్థానం అభివృద్ధికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్ని విధాలుగా సహకరిస్తున్నారు.

– అళహరి మధుసూదన్‌కుమార్, ఆలయ చైర్మన్

తెలంగాణ తిరుపతి మన్యంకొండ

తిరుపతికి మన్యంకొండకు చాలా దగ్గరి పోలికలు ఉండడంతో తెలంగాణ తిరుపతిగా పిలుస్తారు. ఆర్థికస్థోమత లేని భక్తులు మన్యంకొండకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటే తిరుపతికి వెళ్లినంత పుణ్యం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. తిరుపతిలో ఏడుకొండలు ఎక్కి స్వామివారిని దర్శించుకుంటారు. అలాగే మన్యంకొండలో కూడా దేవస్థానం చుట్టూ ఏడు కొండలు ఉన్నాయి. అంతేకాకుండా ఇలాంటి పోలికలు చాలా ఉన్నాయి.

బ్రహ్మోత్సవాల వివరాలు..

బ్రహ్మోత్సవాలు ఈనెల 31న ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు మన్యంకొండ స్టేజి సమీపంలోని కోటకదిరలో అళహరి వంశీయుల ఇంటి నుంచి స్వామివారిని గుట్టపైకి ఊరేగింపుగా తీసుకొచ్చి ఉత్సవాలకు శ్రీకారం చుడుతారు. అదేరోజు రాత్రి స్వామివారి తిరుచ్చి సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఫిబ్రవరి 1న హంసవాహన సేవ, 2న గజవాహన సేవ, 3న సూర్యప్రభ వాహన సేవ, 4న హనుమవాహన సేవ ప్రభోత్సవం, 5న గరుఢ వాహన సేవ, అర్ధరాత్రి తర్వాత రథోత్సవం, 6న అశ్వవాహనసేవ ద్వితీయ ప్రభోత్సవం, 7న శేషవాహన స్వామివారి దర్బార్ సేవ, 11న శేషవాహన సేవ, 18న శివరాత్రితో పాటు సంగీత సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు దిగువ కొండ వద్ద కొలువుదీరిన అలివేలు మంగతాయారు ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్రధాన ఘట్టమైన అమ్మవారి తిరుకల్యాణ మహోత్సవం 7న మధ్యాహ్నం 12గంటలకు ఉంటుంది. దీంతో స్వామివారి ఉత్సవాలు ముగుస్తాయి. దాదాపు నెలల రోజుల పాటు స్వామివారి ఉత్సవాలు కొనసాగుతాయి.

కర్ణాటక మాజీ సీఎం ప్రత్యేక పూజలు



కృష్ణా: మండల సరిహద్దులోని సూగురేశ్వర ఆలయాన్ని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయనను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శివరాజ్‌పాటిల్, మోనేష్, బస్సన్నగౌడ, తిమ్మన్న పాల్గొన్నారు.

లిక్కర్ కంపెనీ ఎదుట ఆందోళన

పెబ్బేరు: మండలంలోని రంగాపూర్ శివారులో ఉన్న లిక్కర్ కంపెనిలో పనిచేస్తున్న మహిళలు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంపెనీలో సుమారు వెయ్యి మంది వరకు మహిళలు పని చేస్తున్నారని, కానీ యాజమాన్యం కనీస వసతులు కల్పించడం లేదని ఆరోపించారు. యాజమాన్యం, సూపర్‌వైజర్లు, ఇన్‌చార్జ్‌లు పనిచేస్తున్న వారిపై నిబంధనలతో తమపై ఒత్తిడి తెస్తున్నారని, కనీసం టాయిలెట్‌కు వెళ్లేందుకు కూడా అవకాశం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భోజనం సమయాన్ని తక్కువగా కేటాయించి తినకుండా ప్రతి రోజు పని చేయిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను కంపెనీ పాటించడం లేదని, పనికి వచ్చే కార్మికులకు ప్రత్యేక బస్సులు నియమించకపోవడంతో ప్రైవేట్ వాహనాలు, ఆటోలలో వస్తూ రోడ్డు ప్రమాదాలకు గురైన సంఘటనలు చాలా ఉన్నాయన్నారు. సంఘటన స్థలానికి ఎస్‌ఐ రామస్వామి వచ్చి మహిళా కార్మికులతో మాట్లాడి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. కంపెనీ యాజమాన్యం పూర్తిస్థాయిలో హామీ ఇవ్వకుంటే పని చేయమని, వారు వెనుతిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు.

అంతంపల్లిలో 'దృశ్యం' ఉదంతం

- హత్య చేసి సహజ మరణంగా చిత్రీకరణ
- ఆలస్యంగా వెలుగుచూసిన నాలుగు నెలల నాటి ఘటన
- తాజాగా ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

మహబూబ్‌నగర్ క్రైం/నవాబుపేట: మండలంలోని మరికల్ శివారు గ్రామం అంతంపల్లిలో దృశ్యం చిత్రంలాంటి ఉదంతం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసి ఆపై సహజ మరణంగా బంధువులను నమ్మించి అంత్యక్రియలు పూర్తిచేశారు. నాలుగు నెలల క్రితం చోటుచేసుకున్న ఈ సంఘటన మృతుడికి ఉన్న భూమి విషయంలో వారసుల కోసం జరిగిన గొడవతో తాజాగా బహిర్గతమైంది. దీనిపై రీపోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు పూర్తి వివరాలు సేకరించి హంతకులను అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి మహబూబ్‌నగర్ రూరల్ సీఐ రాజేశ్వర్‌గౌడ్, నవాబ్‌పేట ఎస్‌ఐ పురుషోత్తం కథనం ప్రకారం.. అంతంపల్లికి చెందిన ఇండ్ల నర్సింహులు(58) భార్య కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందగా.. ఒక కూతురు ఉండగా వివాహం చేశారు. దీంతో ఒంటరిగా ఉంటున్న నర్సింహులు అదే గ్రామానికి చెందిన వితంతువైన ఇందోళ్ల చెన్నమ్మతో వివాహేతర సంబంధం కొనసాగించాడు. కాగా ఈ విషయం నచ్చని చెన్నమ్మ కుమారుడు రాజశేఖర్ తల్లితో తరుచుగా గొడవపడేవాడు. హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న రాజశేఖర్ పలుమార్లు నర్సింహులును హెచ్చరించాడు. దీంతో గతేడాది సెప్టెంబర్ 14న రాత్రివేళ హైదరాబాద్ నుంచి వచ్చిన రాజశేఖర్ అతని తల్లి చెన్నమ్మ కలిసి నర్సింహులును ఇంట్లోనే గొంతునులిమి చంపేశారు. అనంతరం రాజశేఖర్ హైదరాబాద్‌కు వెళ్లిపోగా ఉదయం చెన్నమ్మ నర్సింహులు సహజంగానే మరణించాడని బంధువులకు చెప్పింది. దీనిపై నర్సింహులు సోదరుడు రాములుకు అనుమానం వచ్చి చెన్నమ్మను నిలదీశాడు. దీంతో తామే హత్యచేశామని ఒప్పుకొని, ఎవరికీ చెప్పవద్దని వేడుకున్నారు. కాగా, దీంతో మృతుడు నర్సింహులకు ఎవరూ వారసులు లేకపోవడంతో అతనికి సంబంధించిన 28 గుంటల భూమిని సొంతం చేసుకోవాలని రాములు అత్యాశతో వారి చేతులు కలిపి మృతుడి రక్తం మరకలు ఉన్న దుస్తులను గ్రామశివారులో దాచిపెట్టి..సహజ మరణంగా చిత్రీకరించి హడా వుడిగా అంత్యక్రియలు ముగించారు. ఈ తతంగం తెలియకపోవడంతో ఆలస్యంగా అనుమా నం వచ్చిన నర్సింహులు కూతురు భర్త మండలంలోని యన్మన్‌గండ్లకు చెందిన బాలయ్య గతే డాది అక్టోబర్ 21న పోలీసులకు ఫిర్యాదు చేశా డు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు రీ పోస్టుమార్టం చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. రిపోర్టులో హత్య చేసినట్లు తేలడంతో విచారణ జరిపారు. ఈ మేరకు శుక్రవారం చెన్నమ్మ, రాజశేఖర్, రాములును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జల్సాల కోసం రైళ్లలో చోరీలు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకట్రాములు

మహబూబ్‌నగర్ క్రైం: క్రికెట్ బెట్టింగ్, జల్సాలకు అలవాటుపడిన యువకుడు రైళ్లలో చోరీలు చేయడం ప్రారంభించాడు. ఇటీవల మహబూబ్‌నగర్ పరిధిలో రైళ్లలో వరస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా రైల్వే పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వెంకట్రాములు వివరాలు వెల్లడించారు. మిడ్జిల్ మండలం వాడియల్ చెందిన రమేష్ మొదట ఆంధ్రాలోని విజయనగరం, పార్వతీపురం ప్రాంతాల్లో లగేజీ బ్యాగ్‌లు విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో రెండేళ్ల నుంచి క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడి, జల్సాలు చేయడం మొదలుపెట్టాడు. బెట్టింగ్‌లో డబ్బులు కోల్పోవడంతో ఈ క్రమంలో రైళ్లలో చోరీలు చేయాలని నిర్ణయించుకుని మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్‌స్నాచింగ్ చేయడం మొదలుపెట్టాడు. రాత్రి వేళలలో జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కి మార్గమధ్యలో స్టేషన్స్ దగ్గరకు వస్తున్న క్రమంలో డోర్స్ దగ్గర నిలబడిన మహిళలు, టాయిలెట్స్ కోసం వచ్చే మహిళల మెడలో నుంచి పుస్తెల తాడు అపహరించుకుని పరారయ్యేవాడు. నాలుగు నెలల వ్యవధిలో ఆరు కేసుల్లో 190గ్రాముల బంగారం అపహరించగా ఇతని నుంచి నాలుగు కేసుల్లో 14తులాల బంగారం రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు.

మహిళా గ్రూప్ డబ్బుల కోసం.. భార్య, తల్లిదండ్రులపై కొడుకు దాడి

ముగ్గురికి తీవ్రగాయాలు.. ఉస్మానియాకు తరలింపు

బాలానగర్: మహిళా సంఘం ద్వారా వచ్చిన రూ.50 వేలను తనకు చెప్పండా అప్పు కట్టిందని ఆగ్రహానికి గురైన భర్త భార్యతోపాటు అడ్డు వచ్చిన తల్లిదండ్రులపై కూరగాయలు కోసే కత్తిపీటతో విచక్షణ రహితంగా దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని బంధువులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మండలంలోని నేరళ్లపల్లిలో శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి ఎస్‌ఐ జయప్రసాద్ కథనం ప్రకారం.. నేరళ్లపల్లికి చెందిన రేవల్లి బాలరాజు(48) తాగుడుకు బానిసై నిత్యం కుటుంబ సభ్యులను వేధించేవాడు. ఈ క్రమంలో గురువారం భార్య హంసమ్మ మహిళా గ్రూప్‌లో రూ.50 వేలు రుణం తీసుకుని.. భర్తకు తెలియకుండా గ్రామంలోనే ఇతరుల వద్ద తీసుకున్న అప్పు చెల్లించింది. డబ్బులు వచ్చిన విషయం తెలుసుకున్న బాలరాజు శుక్రవారం రాత్రి డబ్బులు ఇవ్వాలని భార్యను వేధించాడు. ఆమె అప్పు చెల్లించానని చెప్పడంతో కోపోద్రిక్తుడై కూరగాయలు కోసే కత్తితో విచక్షణారహితంగా దాడిచేయడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆమె కేకలు వేయడంతో పక్క గదిలో ఉన్న తల్లిదండ్రులు బాలమ్మ, భీమయ్య వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో బాలరాజు రూంలోనే ఉన్న నానమ్మ, తాతలకు తెలిపాడు. వెంటనే అదే కత్తితో వారిపై కూడా దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. బంధువులు వచ్చి క్షతగాత్రులను షాద్‌నగర్‌కు తరలించారు. నట్లు సమాచారం. ఈ ఘటనపై తండ్రి భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీటు తర్వాతే ఫీజు
5వ తరగతి చదువుతున్న వారికి, 6వ లో ప్రవేశానికై
నవోదయ
దరఖాస్తు చివరి తేదీ:31-01-2023 పరీక్ష తేదీ:29-4-2023
ఫోన్‌లో కాకుండా ఒక్కసారి సందర్శించండి
కొత్తకోట 9985431451

1,290 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగుల వరకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,140, సమాంతర కాల్వ ద్వారా 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వెయ్యి క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ తెలిపారు.

M.Ed Seats available Batch - 2022 -24
PRAGATHI COLLEGE OF EDUCATION (M.Ed.)
(Affiliated to Palamuru University - Mahabubnagar)
Achampet, Nagarkurnool (Dist.)
Cont: 8555935985, 9490143075

ఆధునిక వ్యవసాయం.. లాభాలు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: వాతావరణంలో మార్పులు.. తగ్గుతున్న భూగర్భ జలాలు.. కూలీల కొరత.. పెట్టుబడుల పెరుగుదల.. తగ్గుతున్న భూసారం వంటి సమస్యలతో పంట సాగులో రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఆధునిక, శాస్త్రీయ సేంద్రియ పద్ధతులు పాటించి సాగుకు సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తే సాగు లాభ సాటిగా మారుతుందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు.

యాంత్రీకరణ..

ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ పనులకు కూలీల కొరత తీవ్రంగా ఉంది. వీటిని అధిగమించడానికి ఎరువులు, విత్తనాలు వేసే సీడ్ డ్రిల్ వంటి పరికరాలు, వరి నాటు యంత్రాలు, దుక్కి చేసే రొటోవేటర్స్, పురుగుల మందు పిచికారీ కోసం ట్రాక్టర్ స్ప్రేయర్లు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వీటి వినియోగంతో సాగు వ్యయాన్ని తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుంది.

మిశ్రమ పద్ధతులకు ప్రాధాన్యం..

రైతులు సాధారణ పంటలతో పాటు ఉద్యాన పంటలు, పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకం చేపట్టాలి. దీంతో రైతులకు ఒక విధంగా కలిసిరాకున్న మరొక రంగంలో కలిసి వస్తోంది.

అంతర్ పంటలు సాగు..

ఒకే రకమైన పంటను కాకుండా అంతర్ పంటలను సాగు చేసుకోవాలి. దీర్ఘ కాలిక పంటల్లో స్వల్ప కాలిక పంటలను అంతర్ పంటలను సాగు చేయాలి. దీంతో భూసారం పెరగడమేకాక రైతులకు ఖచ్చితమైన ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది.



రైతులకు అందుబాటులో రొటోవేటర్

నాణ్యమైన విత్తనాలు..

విత్తనాల కోసం ఊరు, పేరు లేని విత్తనాలపై ఆధారపడరాదు. నాణ్యమైన విత్తనాలను సేకరించుకొని రైతులే విత్తనాలను తయారు చేసుకోవాలి. దీంతో మీతో పాటు తోటి రైతులకు సాయం చేయడానికి అవకాశం ఉంటుంది.

తక్కువ నీటితో ఎక్కువ సాగు..

సాగు నీటిని ఆదా చేసే డ్రిల్, తుంపర సేద్యం పరికరాలను వాడాలి. దీంతో తక్కువ నీటితో ఎక్కువ ఎకరాల్లో పొలం సాగు చేసుకోవచ్చు.

మార్కెట్ ధరలపై అవగాహన..

రైతులు మార్కెట్ ధరలపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలి. దినపత్రికల్లో వచ్చే మార్కెట్ ధరలను పరిశీలించి రైతులు అమ్మకాల్లో తగు చర్యలు తీసుకోవాలి.

వాతావరణంపై సమాచారం..

వ్యవసాయ పరిశోధన స్థానాలు ఉన్న చోట వారానికి రెండు మూడు రోజులు ముందస్తు వాతావరణ సలహాలను అందిస్తున్నారు. వీటి ఆధారంగా వ్యవసాయ పనులు చేపట్టాలి.

వ్యవసాయ వార్తలపై దృష్టి..

దినపత్రికలు, మీడియాలో వచ్చే వ్యవసాయ వార్తలపై ప్రత్యేక దృష్టిసారించాలి. దీంతో వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు, సూచనలు లభిస్తాయి. వ్యయంలో ఎదుర్కొంటున్న సమస్యలకు కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చును. వ్యవసాయ శిక్షణ తరగతులు, మేళాలు, ప్రదర్శనలు ఎక్కడ జరిగిన వెళ్లి అవగాహన పెంచుకోవాలి. ఇతర రైతులతో ఎప్పటికప్పుడు నూతన వ్యవసాయ పద్ధతులపై చర్చించి వారి నుంచి సమాచారం పొందాలి.

నడిరోడ్డుపై హిజ్రాల హల్‌చల్



రోడ్డుపై ఆందోళన చేస్తున్న హిజ్రాలు

మహబూబ్‌నగర్ క్రైం: పట్టణ ప్రధాన రోడ్డుపై శుక్రవారం రాత్రి హిజ్రాలు హల్‌చల్ చేశారు. పాత కలెక్టరేట్ ఎదుట ప్రధాన రోడ్డుపై ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం రాత్రి హిజ్రాలకు, వ్యభిచారం చేసే మహిళ సంబంధికులకు చిన్నపాటి వాగ్వివాదం చోటు చేసుకున్న సమాచారం. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో పాటు ఓ హిజ్రా గాయపడినట్లు సమాచారం. దీంతో హిజ్రాలు అందరూ కలిసి రోడ్డుపై ఆందోళనకు దిగారు. మొదట చిన్నగా మొదలై ఆ తర్వాత ముగ్గురు హిజ్రాలు శరీరంపై పెట్రోల్ పోసుకోవడంతో హైడ్రామా సాగింది. దాదాపు మూడు గంటల పాటు పోలీసులు వారిని అక్కడి నుంచి తరలించడానికి శ్రమించారు. చివరకు ఫైర్‌ఇంజన్ సాయంతో నీటిని కొట్టిన రోడ్డుపై అర్ధనగ్నంగా కూర్చుకున్నారు. చివరకు దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చి, అక్కడి నుంచి వారిని తరలించారు. ప్రధాన రోడ్డుపై ఆందోళన చేయడం వల్ల ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
■ రాజాపూర్ @ NH-44 దగ్గర 0% ఇంట్రెస్ట్ తో 30 నెలలు EMI తో అన్ని డేవలప్‌మెంట్స్ తో 147 గజాల MUDA=(HMDA) లేఔట్లో ఓపెన్ Plots కలవు. ఫ్రీ సైట్ విజిట్ వ సంప్ర. ఫోన్ : 9949695027.

SERVICES

BUSINESS OFFER
■ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 9034974058

WANTED
■ మహారాష్ట్ర మరియు కర్ణాటక నందు పనిచేయుటకు అనుభవం ఉన్న సైట్ సూపర్‌వైజర్స్, డ్రైవర్స్ కావలెను PVR Projects Ltd Hyd. ఫోన్ 040-23348080, 23338080. E-Mail: adm.vineela@gmail.com
■ ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థ J.Group కంపెనీ హైదరాబాద్‌లో పని చేయుటకు ఉత్సాహవంతమైన యువకులు కావలెను. సాలరీ: 14,000 to 40,000/- + కమీషన్. Quali: 10th, ఇంటర్, డిగ్రీ. ఫోన్: 9666688883.

సాక్షి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే
HAPPY BIRTHDAY

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)
అదనపు లైనుకు రూ. : 50
5% GST అదనం మాత్రమే
వివరాలకు :
మహబూబ్‌నగర్ : 9010234478
9010522215
9705135557
9010869797
జడ్చర్ల : 9010076222
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9010068317
గద్వాల : 9553955603
నారాయణపేట : 9010962007

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు ... - సాక్షి మేనేజ్‌మెంట్

క్లుప్తంగా...



రాణాలో మాజీ కలెక్టర్ ఆకునూరి మురళి

పోలీస్‌స్టేషన్‌లో మాజీ కలెక్టర్ మురళి

- రోడ్డుపై వాహనదారుడిని చితకబాదిన ఎస్ఐ
- అడ్డుకున్న మాజీ కలెక్టర్, ఠాణాలో ఎస్సైపై ఫిర్యాదు

భూపాలపల్లి: ఆయన జిల్లా మాజీ కలెక్టర్. రహదారిపై ఓ వాహనదారుడికి జరుగుతున్న అన్యాయాన్ని చూసి అడ్డుకున్నారు. ప్రత్యక్ష సాక్షిగా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాధితుడితో కలిసి ఫిర్యాదు అందించారు. ఈ ఘటన పూర్వాపరాలిలా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లాకేంద్రానికి చెందిన కూనారపు భిక్షపతి శుక్రవారం సాయంత్రం పట్టణంలో బైక్‌పై వెళ్తుండగా స్థానిక ఎస్సై రామకృష్ణ అతని వాహనాన్ని ఆపారు. రాంగ్‌రూట్‌లో ఎందుకు వచ్చావంటూ దురుసుగా వ్యవహరిస్తూ, లాఠీతో చితకబాదుతుండగా అదే సమయంలో అటుగా వెళ్తున్న మాజీ కలెక్టర్ ఆకునూరి మురళి ఈ ఘటనను చూసి ఆగారు. ఎస్సై దాడిని ఆపి, 'మనం ఏ రాష్ట్రంలో ఉన్నాం.. అతడిని ఎందుకు కొడుతున్నావు' అని ప్రశ్నించారు. అనంతరం బాధితుడు భిక్షపతిని వెంట తీసుకొని భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐపై ఫిర్యాదు చేయించారు. తానే ప్రత్యక్ష సాక్షినని సంతకం చేసి ఆ ఫిర్యాదును అందజేశారు. డీఎస్పీ రాములు, సీఐ రాజిరెడ్డితో మాట్లాడి ఎస్సై రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని మురళి డిమాండ్ చేశారు.

కేలండర్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో 'తెలంగాణా నాన్ గెజిటెడ్ యూనిట్' కేలండర్‌ను ఆ శాఖ సంచాలకుడు బి.రాజమౌళి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సమాచార శాఖ అదనపు సంచాలకులు నాగయ్య కాంబ్లీ, కిశోర్ బాబు హాజరయ్యారు.



ఐఏఎఫ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట: ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో శాశ్వత ప్రాతిపాదికన నిర్వహించనున్న మెడికల్ ట్రేడ్ ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి ఆసక్తి గల నిరుద్యోగులు హాజరు కావాలని వింగ్ కమాండర్ సజ్జ శ్రీ చైతన్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులు కేవలం దక్షిణ భారత రాష్ట్రాల నుంచి మాత్రమే నిర్వహిస్తున్నందున అభ్యర్థులు సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పోస్టులు పురుషులకు మాత్రమే వర్తిస్తాయని, ఎంపికైనా వారికి జీతంతో పాటు పింఛన్‌తో కూడిన శాశ్వత ఉద్యోగం ఉంటుందని తెలిపారు. ఇంటర్‌లో (బైపీసీ), డిప్లొమా ఇన్ ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు అర్హులు. బైపీసీ ఇంటర్ పూర్తి చేసిన వారు ఫిబ్రవరి 4వ తేదీన ఎయిర్ ఫోర్స్ స్టేషన్, చెన్నై రాష్ట్రం తాంబరంలో నిర్వహించే ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. డిప్లొమా, బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు ఫిబ్రవరి 7వ తేదీన హాజరుకావాలని తెలిపారు. తెలంగాణ నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు వాట్సాప్ నంబర్ 9345377868కు సంప్రదించాలని, ఉద్యోగ నోటిఫికేషన్ కోసం సీడీఏసీ.ఇన్ చూడవచ్చని తెలియజేశారు.

పల్లకీసేవలో అభయాంజనేయ స్వామి



ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి వారికి అభిషేకం, అర్చనలు పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది, ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

హక్కుల రక్షణకు రచయిత కాపలాదారు కావాలి

- కవులు, రచయితలు, మేధావులను హతమార్చడం పిరికిపందల చర్య
- రాజ్యాంగంపై పూర్తి నమ్మకం ఉంది..
- కొంకణి భాషకు అధికారహోదా కోసం సుదీర్ఘ ఉద్యమం
- పోర్చుగీసువారి రాకతోనే దాడి మొదలైంది
- ప్రముఖ కొంకణి రచయిత దామోదర్ మౌజో
- ప్రారంభమైన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్
- ఆదివారం వరకు వేడుకలు..



మాట్లాడుతున్న రచయిత దామోదర్ మౌజో

సాక్షి, సిటీబ్యూరో: ప్రాథమిక హక్కుల రక్షణ, రాజ్యాంగ పరిరక్షణకు రచయితలు, కవులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు కాపలాదారుగా వ్యవహరించాలని ప్రముఖ కొంకణి రచయిత, జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత దామోదర్ మౌజో అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల కోసం సాహిత్య సృజన చేసే కవులు, రచయితలను హతమార్చడం పిరికి పందల చర్య అన్నారు. సత్యాన్ని ఎదుర్కోలేకనే కల్‌బుర్గి, దబోల్కర్, గౌరీలంకేష్ వంటి మేధావులను, రచయితలను హత్య చేశారని ఆరోపించారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ శుక్రవారం విద్యారణ్య స్కూల్‌లో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కీలకోపన్యాసం చేశారు. ఇందిరాగాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కవులు, రచయితలు ప్రజలను చైతన్యం చేశారన్నారు. తనకు రాజ్యాంగం పట్ల పూర్తి నమ్మకం ఉందన్నారు. జీవించే హక్కుతో సహా ప్రాథమిక హక్కులకు రక్షణ లేకపోవడం దారుణమన్నారు. మనుషులు ఏం తినాలో, ఏం తినకూడదో కూడా వాళ్లే నిర్ణయిస్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఢిల్లీ జేఎన్‌యూ క్యాంటీన్‌లో మాంసాహారం వండకూడదని ఒక విద్యార్థి సంఘం హెచ్చరించడం దారుణమన్నారు. ఇలాంటి అప్రజాస్వామిక ధోరణుల ను నిరసించాలన్నారు. అలాగే హక్కులను కాపాడుకోవాలని చెప్పారు. రచయితగా తాను సైతం తీవ్రమైన హెచ్చరికలు, ఒత్తిళ్లను ఎదుర్కొన్నట్లు చెప్పారు.

కొంకణి భాష కోసం సుదీర్ఘమైన ఉద్యమం...

గోవా ప్రజలు తమ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు పెద్ద ఉద్యమమే చేయాల్సి వచ్చిందన్నారు. మౌర్యుల కాలం నుంచి ఒక ఉనికిని కలిగి ఉన్న కొంకణి ప్రాంతం పోర్చుగీసు వారి రాకతో విచ్ఛిన్నమైందన్నారు. మతమార్పిడులు, సాహిత్య, సాంస్కృతిక మార్పిడులు తమ ఉనికిని ప్రమాదంలోకి నెట్టాయన్నారు. కొంకణిభాషకు లిపి లేకుండా పోయిందన్నారు. పోర్చుగీసు దాడుల నేపథ్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో వలసి వెళ్లారని చెప్పారు. ఈ క్రమంలో కొంకణి మాతృభాషగా కలిగిన వారు ఆయా రాష్ట్రాల్లోని భాషల లిపినే కొంకణి లిపిగా మార్చుకున్నారన్నారు. గోవా స్వతంత్ర రాష్ట్రంగా అవతరించిన తర్వాత దేవనాగరి భాషను కొంకణి అధికార భాషగా గుర్తించేందుకు తాము సుదీర్ఘ ఉద్యమం చేపట్టినట్లు గుర్తు చేశారు. గోవాలోని మారుమూల పల్లెటూరుకు చెందిన తాను ప్రజల జీవితాలను, కష్టాలను, బాధలను దగ్గర నుంచి చూడడం వల్ల ప్రజల గాథలనే ఇతివృత్తంగా ఎంచుకుని రచనావ్యాసంగం కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

వేడుకలు వైవిధ్యం...

హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్ అధ్యక్షత వహించారు. జర్మనీ రాయబార కార్యాలయం ప్రతినిధి స్టీఫెన్ గ్రాబర్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ డైరెక్టర్‌లు అమితాదేశాయ్, ప్రొఫెసర్ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభిన్న భాషల సాహిత్యాన్ని ఒక వేదికకు తేవడం గొప్ప కార్యక్రమమని వక్తలు కొనియాడారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ఒక వైవిధ్యభరితమైన వేడుక అని స్టీఫెన్ చెప్పారు. జర్మనీ భాషా సాహిత్యాలను, కళలను ఈ వేదికపైన ప్రదర్శించే చక్కటి అవకాశం లభించిందన్నారు.

తారకరత్నకు గుండెపోటు

- లోకేశ్ పాదయాత్రలో ఆదిలోనే అపశ్రుతి
- నడక ప్రారంభించిన పది నిమిషాల్లోనే కుప్పకూలిన వైనం
- అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లిన కార్యకర్తలు
- తారకరత్న వెంట వెళ్లకుండా పాదయాత్ర కొనసాగించిన లోకేశ్
- యాత్ర కొనసాగింపుపై టీడీపీ నేతల విస్మయం

కుప్పం/కుప్పం రూరల్ (చిత్తూరు జిల్లా) : టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ ప్రారంభించిన పాదయాత్రలో ఆదిలోనే అపశ్రుతి చోటుచేసుకుంది. లోకేశ్‌తో పాటు పాదయాత్రలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు మనుమడు తారకరత్న గుండెపోటుతో కుప్పకూలిపోయారు. ఆయన ఎన్టీఆర్ కుమారుడు నందమూరి మోహనకృష్ణ కుమారుడు. శుక్రవారం ఉదయం 11.10 గంటలకు కుప్పం మండలం లక్ష్మీపురం గ్రామంలోని శ్రీ వరదరాజస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, లోకేశ్ పాదయాత్ర ప్రారంభించారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, నందమూరి తారకరత్న, టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తదితరులు ఉన్నారు. అక్కడి నుంచి అర కిలోమీటరు దూరంలో బాబునగర్ వద్ద ఉన్న మసీదుకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 12 గంటల సమయంలో మసీదు నుంచి బయటకు వచ్చిన తర్వాత కార్యకర్తలు తోసుకొని మీద పడటంతో తారకరత్న అస్వస్థతకు గురయ్యారు. నిలదొక్కుకోలేక సొమ్మసిల్లి కింద పడిపోవటంతో కార్యకర్తలు హుటాహుటిన పట్టణంలోని కేసీ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అంబులెన్స్‌లో పీఈఎస్ మెడికల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు తారకరత్నను క్రిటికల్ కేర్ యూనిట్‌లో ఉంచి చికిత్స ప్రారంభించారు. నందమూరి బాలకృష్ణ ఆస్పత్రికి చేరుకుని వైద్యులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ, రక్తనాళాలు 90 శాతం మూసుకుపోవటంతో తారకరత్న స్పృహ కోల్పోయాడన్నారు. ప్రాణాపాయం లేదని, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. తారకరత్నను ఆస్పత్రికి తరలించగానే మరోవైపు లోకేశ్ తన పాదయాత్రను కొనసాగించారు. తారకరత్న వెంట వెళ్లకుండా లోకేశ్ పాదయాత్ర కొనసాగించడంపై పార్టీలోని పలువురు నేతలు విస్మయం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుడు, బావ అయిన ఆయన పరిస్థితి సీరియస్‌గా ఉందని తెలిసినా, లోకేశ్ రాజకీయాలకే ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని, ప్రజల్లోకి వేరే సంకేతాలు వెళతాయని వారు చర్చించుకున్నారు. ఇదిలా ఉండగా, తారకరత్నకు చికిత్స అందిస్తున్న ఆస్పత్రి సిబ్బంది ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని, వారినెవరినీ బయటకు పంపడం లేదని.. బయటి నుంచి కూడా ఎవరినీ ఆస్పత్రి లోపలకు అనుమతించడం లేదని సిబ్బంది కుటుంబీకులు వాపోతున్నారు. అసలు ఆస్పత్రిలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదని టీడీపీ శ్రేణులే గుసగుసలు పోతుండటం గమనార్హం.

బెంగళూరు తరలింపునకు ఏర్పాట్లు.. అంతలోనే నిర్ణయం మార్పు

ఆస్పత్రిలో తారకరత్నకు వైద్యం అందించిన వైద్యులు.. బెంగళూరుకు సిఫార్సు చేశారు. ఈ విషయాన్ని టీడీపీ శ్రేణులు జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆస్పత్రి మెడికల్ రిపోర్ట్ సమర్పిస్తే తప్పకుండా సహకరిస్తామని ఎస్పీ వారికి తెలిపారు. అంతలో తొలి రోజు పాదయాత్ర ముగించుకున్న లోకేశ్ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మామ బాలకృష్ణతో మాట్లాడారు. ఆ తర్వాత తారకరత్నను బెంగళూరుకు తరలించడం లేదని, బెంగళూరు నారాయణ హృదయాలయ ఆస్పత్రి నుంచి వచ్చిన వైద్యులు ఇక్కడే చికిత్స అందిస్తారని పార్టీ శ్రేణులకు వారు సమాచారం ఇచ్చారు. లోకేశ్ వెళ్లగానే నిర్ణయం మారిపోవడంతో టీడీపీ కార్యకర్తలు ఆశ్చర్యపోయారు. బెంగళూరుకు తీసుకెళ్లుంటే మరింత మెరుగైన వైద్యం అందుబాటులో ఉండేదని, ఇలా ఎందుకు చేశారో అర్థం కావడం లేదని చర్చించుకున్నారు. ఇదిలా ఉండగా రాత్రి 9.30 గంటలకు తారకరత్న భార్య అలేఖ్య రెడ్డి, కుమార్తె నిషిక(9) పీఈఎస్ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. వీరితో పాటు తారకరత్న బావమరిదితో బాలకృష్ణ, లోకేశ్, మరికొందరు మాట్లాడాకే.. తారకరత్నకు ఇక్కడే వైద్యం అందిస్తున్నట్లు ప్రకటించారు. తారకరత్న కుటుంబ సభ్యుల అంగీకారంతోనే ఇక్కడే వైద్యం కొనసాగిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అయితే నాటకీయపరిణామాల మధ్య అర్ధరాత్రి సమయంలో తారకరత్నను మెరుగైన చికిత్స కోసం ప్రత్యేక అంబులెన్స్‌లో బెంగళూరు తరలించారు.

సింగరేణిలో 'ఫ్లోటింగ్ సోలార్' వెలుగులు

- ఎస్టీపీపీలో నేడు 5 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం
- జైపూర్ విద్యుత్ కేంద్రానికి అనుసంధానం



రిజర్వాయర్ నీటిపై తేలియాడే సోలార్ పవర్ ప్లాంటు

జైపూర్ (చెన్నూర్): మంచిర్యాల జిల్లా జైపూర్‌లో సింగరేణి సంస్థ నిర్మిస్తున్న అత్యాధునిక ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ ఉత్పత్తికి సిద్ధమైంది. సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్ (ఎస్టీపీపీ)కి నీరందించే రెండు రిజర్వాయర్ల నీటిపై తేలియాడే సోలార్ విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 700 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్న సింగరేణి సంస్థ ఏరియాల వారీగా ఇప్పటికే భూమిపై 219 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోంది. కాగా, ఎస్టీపీపీలోని రెండు రిజర్వాయర్లపై రెండు విభాగాలుగా 15 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. తొలి విడతలో 5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియకు శనివారం శ్రీకారం చుట్టనున్నారు. జైపూర్ విద్యుత్ కేంద్రానికి దీనిని అనుసంధానం చేస్తారు. వంద ఎకరాల్లోని రిజర్వాయర్-1, 2లపై రూ.78 కోట్లతో సోలార్ పవర్‌ప్లాంట్లు నిర్మించారు. ఒక రిజర్వాయర్‌పై ఐదు మెగావాట్లు, మరో రిజర్వాయర్‌పై 10 మెగావాట్ల ప్లాంట్లు ఉన్నాయి. సింగరేణి సంస్థ ఏడాదికి రూ.500 కోట్ల వరకు విద్యుత్ కోసం ఖర్చు చేస్తుండగా, సోలార్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను స్థానిక అవసరాలకు వినియోగించుకోనుంది. ఫలితంగా రూ.200 కోట్లకుపైగా సంస్థకు ఆదా కానుంది. భూమిపై నిర్మించిన సోలార్ పలకలన్నా నీటిపై నిర్మించే ఫ్లోటింగ్ సోలార్ ఫలకల జీవితకాలం ఎక్కువ అని చెపుతున్నారు. కాగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజుకు 25 వేల యూనిట్ల విద్యుత్ చొప్పున ఏడాదికి 20 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేయనున్నారు.

విద్యుత్ కోతలపై ఆగ్రహం



గట్టులో ట్రాన్స్‌కో ఏఈను చుట్టుముట్టిన రైతులు

- గట్టు సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా
- నీళ్లు పారించలేకపోతున్నామంటూ ఆవేదన
- విద్యుత్ అధికారుల చుట్టుముట్టి నిరసన

గట్టు: విద్యుత్ కోతలపై అన్నదాతలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేసి అక్కడే బైఠాయించారు. గట్టు, యల్లందొడ్డి, గంగిమాన్‌దొడ్డి, సల్కాపురం చెందిన రైతులు పెద్ద ఎత్తున సబ్‌స్టేషన్‌కు తరలివచ్చారు. మూడు రోజులు విద్యుత్ కోతలు ఎక్కువైనట్లు రైతులు వాపోయారు. యాసంగిలో వరి, వేరుశనగ, ఆముదాలు, మిరప, కూరగాయల పంటలను సాగు చేశామని, కరెంట్ కోతల కారణంగా దెబ్బతింటున్నాయని వాపోయారు. వ్యవసాయానికి అందించే త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాలో ఇష్టానుసారంగా కోతలు పెడుతున్నారని, కరెంట్ ఎప్పుడు వస్తుందో? ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి ఉందన్నారు. కరెంట్ రాక కోసం బోర్ల వద్ద కాపలా కాసే పరిస్థితి నెలకొందన్నారు. గంటా, రెండు గంటల కరెంట్ వదిలి కట్ చేస్తున్నారని, మళ్లీ గంట తర్వాత కరెంట్ వస్తే మడుల్లో ఇది వరకు పారిన చోటే నీరు పారుతున్నాయని, ఇలా అయితే యాసంగిలో సాగు చేసుకున్న పంటలను ఎండ గొట్టుకోవాల్సి వస్తుందన్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో విద్యుత్ కోతలు ఏ స్థాయిలో ఉంటాయో ఊహించుకుంటేనే భయమేస్తుందని వాపోయారు. ఇది వరకు వ్యవసాయానికి రెండు విడతల్లో రాత్రి 12 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు, తిరిగి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5:45 వరకు త్రీ ఫేజ్ కరెంట్ సరఫరా చేస్తున్నారని, ఇదే విధంగా కొనసాగించాలని రైతులు కోరారు.

ఆదేశాలు పాటిస్తున్నాం..

సీఎంసీ (కార్పొరేట్ ఆఫీస్ హైదరాబాద్) నుంచి వచ్చే ఆదేశాలను పాటించకపోతే ఉద్యోగాలు పోతాయని సబ్‌స్టేషన్‌లో పని చేసే ఆపరేటర్ రైతులతో వాపోయాడు. ఇక్కడి సబ్‌స్టేషన్‌లో లోడ్‌ను వారు నిరంతరం గమనిస్తూ, లోడ్ పడిన క్రమంలో మెసేజ్ రూపంలో సీఎంసీ నుంచి సమాచారం అందుతుందని, దాని ప్రకారం కరెంట్ సరఫరాను నిలిపి వేయాల్సి వస్తుందని ఆపరేటర్ రైతులకు తెలిపారు. పక్క మండలాల్లో కరెంట్ కోతలు లేకుండా సరఫరా చేస్తుంటే, గట్టులో మాత్రం ఎందుకు కోతలు పెడుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వేళల్లో మార్పులేదు

విద్యుత్ కోతలపై రైతులు ఆందోళన చేస్తున్న విషయాన్ని ఏఈ చెన్నయ్య రైతులతో కలిసి డీఈ లక్ష్మణ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. గతంలో మాదిరిగానే సరఫరా అవుతుందని, వేళలు మార్చలేదని డీఈ చెప్పుకొచ్చారు. సీఎంసీ మార్పుల కారణంగా రెండు రోజులుగా ఇబ్బంది పడుతున్నట్లు ఏఈ డీఈతో చెప్పగా ఆ విషయం తనకు తెలియదని డీఈ బదులిచ్చారు. దీంతో స్థానికంగా ఉన్న అధికారులే కోతలు పెడుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమయానుగుణంగా త్రీ ఫేజ్ కరెంట్ అందిస్తామని ఏఈ రైతులకు సర్దిచెప్పడంతో ఉదయం 9 గంటల నుంచి ఆందోళన చేస్తున్న రైతులు మధ్యాహ్నం 12 గంటలకు ఆందోళన విరమించారు.

నీరు పారడం లేదు



విపరీతమైన కోతల కారణంగా పంటలను ఎండగొట్టుకునే పరిస్థితి ఏర్పడింది. 8 ఎకరాల్లో వరి సాగు చేశా. ఎకరా విస్తీర్ణంలో మిరప సాగు చేశా. పంటలకు నీరు పారించడానికి తంటాలు పడుతున్నాం. రెండు రోజులు పగటి పూట కరెంట్ అసలు ఉండడం లేదు. కరెంట్ కోతలే ఎక్కువ. రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టాం.

– భీమన్న, గట్టు

సాగు చేసేవాళ్లం కాదు



కరెంట్ కోతలుంటాయని ముందే చెప్పి ఉంటే పంటలను సాగు చేయకుండా ఉండేవాళ్లం. వరి, మిరప, వేరుశనగ పంటలను సాగు చేసుకున్నా. వీటి కోసం పెట్టుబడులు పెట్టాం. రోజు కరెంట్ కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూడాల్సి వస్తుంది. కరెంట్ వచ్చిన తర్వాత బోరు నీళ్లు ఎంత సేపు పారుతాయో తెలియదు. ఇష్టామొచ్చినట్లు కోతలు విధిస్తున్నారు. – తిమ్మప్ప, యల్లందొడ్డి

బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు



రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

- ఆంజనేయస్వామికి పల్లకీ సేవ
- రథం వద్ద భక్తుల పూజలు



స్వామి వారి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నాలుగు రోజులుగా బ్రహ్మోత్సవాలకు భక్తులు పోటెత్తి వస్తున్నారు. స్వామి వారికి తమ మొక్కులను సమర్పించుకుంటున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి రథోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శుక్రవారం స్వామి వారి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి దర్శనం అనంతరం రథం వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. జిల్లా నలుమూలలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చినట్లు ఆలక కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ధర్మకర్త గిరి రావు, ఈఓ కవిత తెలిపారు.

కనులపండువగా పుష్పరథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపూర్‌లో శుక్రవారం రాత్రి లక్ష్మీ చెన్నకేశవస్వామి పుష్ప రథోత్సవం (చిన్నతేరు) కనుల పండువగా కొనసాగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో కలిగిన రథాన్ని భక్తులు ఊరేగించారు. అంతకు ముందు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం చెన్నకేశవ స్వామి నామస్మరణంతో మార్మోగింది.

రథసప్తమిని ఘనంగా నిర్వహిద్దాం



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న ఈఓ పురేందర్

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ క్షేత్రంలో వెలసిన సూర్యనారాయణ స్వామి ఆలయంలో 28న రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆలయ ఈవో పురందర్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లుపై పలు సూచనలు చేశారు. ఆలయ సమీపంలోని భక్తులతో పాటు గ్రామస్తులంతా రథసప్తమి వేడుకలలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట రికార్డు అసిస్టెంట్ శ్రీకాంత్, హరిబాబు ఉన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.5.62లక్షలు

అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల ద్వారా దేవస్థానంకు రూ.రూ.5,62,164 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బ్రహ్మోత్సవాలలో ఘనమైన ఏర్పాట్లు చేశారంటూ స్థానిక ఎమ్మెల్యే, అన్ని శాఖల అధికారుల నుంచి ప్రశంసలు అందాయన్నారు. ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2,44,240, అభిషేకాలు ద్వారా రూ.54,300, సహస్త్ర ఘట్టాల ద్వారా రూ.1,13,800, అంతరాలయం దర్శనాల ద్వారా రూ.68,400, త్రిశతి ఖడ్గమాల ఇతరత్ర పూజలు కలిపి రూ.50,516, అన్నదానం ద్వారా రూ.30,908 ఆదాయం వచ్చిందని, ఇక ఖర్చులు తెలియాల్సి ఉందన్నారు.

పోమాల్ సర్పంచ్ సస్పెన్షన్

నవాబుపేట: మండలంలోని పోమాల్ సర్పంచ్ కృష్ణను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ ఉత్తర్వులు అందించారని ఈఓపీఆర్‌డీ బద్రునాయక్ తెలిపారు. గ్రామానికి చెందిన యువకులు రెండు నెలల క్రితం పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో పంచాయతీ అధికారులతో విచారణ చేసి షోకాజ్ నోటీసు జారీ చేశారు. అందుకు వివరణ ఇవ్వకపోవటంతో శుక్రవారం మండల కార్యాలయానికి సస్పెండ్ చేసినట్లు ఆదేశాలు అందాయని తెలిపారు.